క్లుప్తంగా

క్షయ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు

ఆదోని టౌన్: స్థానిక శంకర్‌నగర్ మాక్ సెంటర్‌లో క్షయ వ్యాధిపై నివారణపై అవగాహన సదస్సు హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపుచారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉన్నట్లయితే గళ్ల పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిరవాణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన మందులను అందిస్తారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు బీసీజీ వేయించడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మోచేయి అడ్డుపెట్టుకోవాలన్నారు. మాస్క్ ధరించడం, మనిషి మనిషికి మధ్య దూరం పాటించడం, ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదన్నారు. వార్డు సచివాలయం ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించండి



బైచిగేరిలోని బీసీ కాలనీలో నిలిచిన వర్షపునీరు

ఆదోని టౌన్: ఆదోని మండలం బైచిగేరి బీసీ కాలనీలో రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని గ్రామస్తులు రాముడు, ఆంజనేయులు, సుంకన్న, వీరేష్, సుంకమ్మ, లక్ష్మి తదితరులు మండల పరిషత్ అధికారులను కోరుతున్నారు. కాలనీలో కొత్తగా డ్రెయినేజీ నిర్మించి రోడ్డును ఏర్పాటు చేయడం మరిచారు. దీంతో వర్షపు నీరు వీధిలో ఆగుతున్నాయని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఆగిపోయిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడి వద్ద ఉన్న నగదును బంధువులకు అందిస్తున్న 108 సిబ్బంది

కోసిగి: మండల కేంద్రానికి చెందిన పెండేకంటి తిక్కయ్య బైక్‌పై హాల్వి గ్రామానికి వెళుతుండగా అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం హాల్వి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన రక్త గాయాలతో పడి ఉన్న తిక్కయ్యను అటుగా వచ్చిన ఓ ఆటో డ్రైవర్ గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. కోసిగి అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలంలో పడి ఉన్న క్షతగాత్రుడి నగదు రూ. 12,070 మొత్తాన్ని ఈఎంటీ రమేష్, పైలట్ దేవేంద్రలు, కోసిగి పీహెచ్‌సీ డాక్టర్ నజీర్‌బాషా సమక్షంలో అతని బంధువు నరసింహులు చేతికి అందించి నిజాయితీ చాటుకున్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి



దళితులతో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని జిల్లా నాయకులు బండారి హనుమంతు, పీఎస్ వీరేష్, మండల ఇన్‌చార్జ్ బండారి గిడ్డయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 25వ తేదీన మొదలైన 'గో టూ విలేజ్' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో పర్యటిస్తూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై పోరాడాల్సిన విధి విధానాలపై ప్రజలతో చర్చిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని దిబ్బనకల్, అలసందగుత్తి, సలకలకొండ, గోనబావి, మాంత్రికి, మదిరె, జాలమంచి, బల్లేకల్, పెసలబండ గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దళితుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆదోని ఇన్‌చార్జ్ గుమ్మల బాలస్వామి, నాయకులు జిలాన్‌బాషా, హుసేనప్ప, టి.ఈరన్న, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కి.. లాభాలు చేజిక్కి

- లోతు దుక్కులతో ప్రయోజనం
- చీడ పురుగుల నివారణకు ఆస్కారం
- దిగుబడులు పెరగాలంటే వేసవి దుక్కులు ఖాయం



రేగడి పొలంలో తిరగలి మడకతో దుక్కి చేస్తున్న రైతు

మంత్రాలయం: రబీ సీజన్ ముగియడంతో రైతన్నలు వేసవి దుక్కులకు శ్రీకారం చుట్టారు. లోతు దుక్కులను వేసవి దుక్కులుగా పేర్కొంటారు. వేసవి దుక్కుల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. చీడ పురుగులు, కలుపు మొక్కల నివారణకు ఈ దుక్కులు దోహదపడతాయి. భూసారంతోపాటు తేమశాతం పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. పెట్టుబడులు తగ్గుదలతోపాటు మంచి దిగుబడులు సాధించడానికి వేసవి దుక్కులు అనుకూలం.

వేసవి దుక్కులు చేసుకునే విధానం

పంటల సాగును బట్టి దుక్కులు చేసుకోవాల్సి ఉంటుంది. వేరు వ్యవస్థ లోతుగా ఉండే పంటలకు (కంది, ఆముదం, పత్తి) 25–30 సెంటీమీటర్ల లోతు దుక్కి చేసుకోవాలి. సాధారణ వేరు వ్యవస్థ కల్గిన పైర్లకు (వేరుశనగ, జొన్న, మొక్కజొన్న) 15–20 సెంటీమీటర్ల లోతు దున్నుకోవాలి. వేసవి దుక్కులకు మోల్డ్ బోర్డు నాగలి (తిరగలి నాగలి, రెక్కల నాగలి)ని వినియోగించుకోవడం మంచిది. ఏటవాలు భూముల్లో వాలుకు అడ్డంగా దున్నకం చేయాలి.

దుక్కులతో ప్రయోజనాలు

వేసవి దుక్కులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మంత్రాలయం వ్యవసాయాధికారి జీరా గణేష్ పేర్కొన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో అత్యధికంగా నల్లరేగడి, ఎర్ర నేలలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పత్తి పంట ఎక్కువగా సాగు చేస్తుండడంతో లోతు దుక్కులు కచ్చితంగా చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో లోతు దుక్కులు దోహదపడతాయన్నారు. వ్యవసాయాధికారి వివరించిన ప్రయోజనాలు ఇలా ఉన్నాయి.

- నేల పొరలు విచ్ఛిన్నం కావడంతో నేలలో గాలితో పాటు తేమ శాతం పెరిగి ఆరోగ్యకర సూక్ష్మజీవుల సంతతి మెరుగుపడుతుంది.
- రబీ సీజన్‌లో మిగిలిన కలుపు మొక్కలు, వేర్లు, చెత్తా చెదారం మట్టిలో కలిసిపోవడం, సూర్యరశ్మి సోకడంతో నిద్రావస్థలో ఉన్న చీడ పురుగులు నశిస్తాయి.
- సేంద్రియ పదార్థాలు విడిపోయి త్వరగా పోషకాలుగా మారుతాయి.
- వాలుకు అడ్డంగా దున్నడంతో నేల కోతకు గురికాకుండా నీరు ఇంకిపోవడానికి ఆస్కారం ఉంటుంది.
- పురుగు మందుల అవశేషాలు సూర్యరశ్మికి ఆవిరై నేలకు హాని తగ్గుతుంది.
- మొండి జాతికి చెందిన తుంగ జాతి కలుపు మొక్కల బెడద దాదాపు తొలగిపోతుంది.
- నేలల్లో మట్టి రేణువులు 50 శాతం, నీరు 25 శాతం, గాలి 25 ఉంటుంది. సమపాళ్లలో ఉండాలంటే ఈ దుక్కులు తప్పనిసరి.
- భూమి గుల్లబారడంతోపాటు పైర్ల వేరు వ్యవస్థ వృద్ధి చెంది మొక్క ఆరోగ్యకరంగా పెరుగుతుంది.
- మొక్కకు పోషకాలు అందేందుకు ఎలాంటి అవాంతరాలు ఉండవు.

భూసార పరీక్షలు అవసరం



లోతు దుక్కులు చేసుకోవడంతోపాటు రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవడం మంచిది. భూసారాన్ని బట్టి ఆమ్ల, క్షార ధాతువులు, సూక్ష్మ పోషకాల శాతాలు తెలుసుకోవచ్చు. పరీక్షలకు అనుగుణంగా రసాయన, సేంద్రియ ఎరువులు వాడుకోవచ్చు. తద్వారా పెట్టుబడులు దాదాపుగా తగ్గించుకోవచ్చు. ఇదే సమయంలో సేంద్రియ ఎరువులు నేలలో చల్లుకోవడం చేయాలి. దున్నకాలతో సేంద్రియ పదార్థాలు విచ్ఛిన్నమై త్వరగా నేల సారం పెరిగేందుకు దోహదపడుతుంది. ఘన జీవామృతం, డీకంపోజర్ నేలల్లో చల్లుకోవడంతో సూక్ష్మజీవుల సంతతి పెరుగుతుంది. ఇప్పటికే మండలంలోని రైతులకు వేసవి దుక్కుల ప్రాధాన్యతను వివరిస్తున్నాం. – **జీరా గణేష్, వ్యవసాయాధికారి, మంత్రాలయం**

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



సమాధికి పూలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటైన కౌతాళం జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గ్యారతారీఖ్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రంజాన్ మాసం పూర్తి కావడంతో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో తరలిరావచ్చారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహలు, ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా హుసేని చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహలు, ప్రార్థనలు అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సాయంత్రం చదివింపులు, నాతేషరీఫ్‌లు, సలాముల ఆలపన చేశారు.

సీఎంను విమర్శించే స్థాయి భూపాల్‌కు లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోని టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నాయకుడు భూపాల్‌చౌదరికి లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్ష, కార్యదర్శులు చంద్రకాంత్‌రెడ్డి, దేవా అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. భూపాల్ సీఎంను ఏకవచనంతో సంబోధించడం, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ నేతల ఇసుక, గ్రావెల్, భూదందాలు అధికార పార్టీ నాయకులు చేస్తున్నారని ఆరోపించడం తగదని, గత టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు ఒక్క ఉద్యోగమైనా కల్పించారా అని ప్రశ్నించారు. బాబు వస్తే జాబు వస్తుందని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బాబు చివరకు మహిళా ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాల నాయకులపై విచక్షణారహితంగా దాడులు చేయించి అక్రమ కేసులు బనాయించడం మరిచారా అంటూ నిలదీశారు. నారా లోకేష్ యువగళం యాత్రలో ప్రతి నియోజకవర్గంలో లేనిపోని ఆరోపణలు చేస్తూ ముందుకు సాగుతున్నారే తప్పా దాని వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆరోపించారు. పొత్తులు లేకుండా టీడీపీ ఒక్క సీటు అయినా గెలవగలదా అని సవాల్ విసిరారు. వైస్ చైర్మన్ గౌస్, కౌన్సిలర్లు చలపతి, చిన్నా, యూత్ నాయకుడు నల్లారెడ్డి, కన్వీనర్ మధుసూదన్‌శర్మ, ముస్లీం మైనార్టీ డైరెక్టర్ అమీద్‌బాషా తదితరులు ఉన్నారు.

బస్టాండులో సమస్యల తిష్ఠ



మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నిల్వ ఉన్న వర్షం నీరు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు మంత్రాలయం వస్తుంటారు. వారు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగ్గగానే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌లో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు, అధికారులు ఏర్పాటు చేసిన ఫ్యాన్లు సైతం సక్రమంగా పని చేయకపోవడంతో ఉక్కపోతకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షానికే బస్టాండ్ ప్రాంగణం అంతా వర్షం నీటితో నిండిపోయింది. మరోవైపు ముళ్లపొదలు భయంకరంగా పెరగడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. రాత్రయితే చాలు బస్టాండ్‌లోకి వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండును ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యువగళం బృందం రౌడీయిజం

గోనెగండ్ల: మండలంలోని పుట్టపాశం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై యువగళం పాదయాత్ర బృందం, టీడీపీ నేతలు దాడికి దిగారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద నుంచి హెచ్.కైరవాడి, పుట్టపాశం , వేముగోడు గ్రామాల మీదుగా సాగింది. పుట్టపాశం గ్రామం ఎస్సీ కాలనీలో పాదయాత్ర సాగుతుండగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో లోకేష్ వెంట ఉన్న టీడీపీ నేతలు, యువగళం బృందం వారిపై దాడికి దిగారు. అక్కడే ఉన్న మహిళలు వారిని విడిపించారు. టీడీపీ నాయకులకు రౌడీయిజం చేయడం పరిపాటిగా మరిందని, గతంలో చంద్రబాబు కూడా దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని తమను అవమానించేలా మాట్లాడారని, ఆయన తనయుడు కూడా విదేశీ విద్య వల్ల దళితులు పీకిందేమీ లేదని వ్యాఖ్యనించారని గ్రామ దళితులు మండిపడ్డారు. దళితులను కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబు, లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని గ్రామ నాయకులు గంగాధర్, పెద్ద నాగన్న, మత్స్యవల్లబుడు తదితరులు డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం బొక్కేస్తున్నారు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

హొళగుంద: రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని ఆలూరు గోడౌన్ అధికారులు బొక్కేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎండీయూ ట్రక్కు ఆపరేటర్ ఇలియాస్ మంగళవారం తహసీల్దారు హుసేన్‌సాహేబ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆలూరు ఎంఎల్‌సీ స్టాకు పాయింట్ నుంచి హొళగుంద డీలర్లకు పంపిణీ చేసిన బియ్యం బస్తాలను తహసీల్దారు కార్యాలయానికి తీసుకొచ్చి అధికారుల సమక్షంలో తూకం వేసి చూపించారు. హొళగుందలో 4, 19, 32 రేషన్ షాపులకు సంబంధించి 1,650 మంది కార్డుదారులకు 330 క్వింటాళ్ల (660 బస్తాలు) బియ్యంను ఎండీయూ ట్రక్కు ఆపరేటర్ ఇలియాస్ ప్రతి నెలా పంపిణీ చేయాల్సి ఉంది. మే నెలకు సంబంధించి 32వ రేషన్ షాపుకు వచ్చిన బియ్యం బస్తాలను మంగళవారం ప్రజలకు పంపిణీ చేసేందుకు తీసుకోగా కొన్ని బస్తాల్లో బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. బస్తాలను తూకం వేసి చూడగా 50 కేజీలకుగాను ఓ బస్తాలో 33.5 కేజీలు, మరో బస్తాలో 44 కేజీలు ఇలా తక్కువ తక్కువగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లాతో కలిసి తహసీల్దారు వద్దకు తీసుకెళ్లి తూకాల్లో చేసిన మోసాలను వివరించారు. ఆలూరు గోడౌన్ నుంచి ప్రతి నెలా ఇలానే జరుగుతోందని, దీంతో పేదలకు బియ్యం పంపిణీ చేసే సమయంలో తక్కువ కావడం వల్ల రేషనుదారులు తమను నిందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని మండల కన్వీనర్ షఫివుల్లా ఫోన్‌లో మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌ను ఆదేశించారు.

దంచికొట్టిన వడగండ్ల వాన

పత్తికొండ రూరల్: పత్తికొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం వడగండ్ల వాన దంచికొట్టింది. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షం మొదలై అరగంటపాటు కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పత్తికొండ–కర్నూలు రహదారిలోని వంకలో వర్షపు నీరు ప్రధాన రోడ్డుపైకి ఎక్కి పారడంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. డ్రైనేజీలు వర్షపు నీటితో నిండి మురుగునీరు రోడ్డెక్కి పారింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో 3 గంటల పాటు సరఫరా నిలిపేశారు. భారీ వృక్షాలు నేలకొరిగాయి. గాలివాన బీభత్సంతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు పలువురు రైతులు పేర్కొన్నారు.

నందవరం: మండలంలో వర్షానికి వరి పైరు నేలకొరిగింది. నూర్పిళ్లు, కోతలు కోసిన వరి ధాన్యం, ఎండు మిరప వానకు నానడంతో రైతులు నష్టపోయారు.

7 వరకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో ఈ నెల 7వ తేదీ వరకు చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ మహదేవయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఆదోని రూరల్: ఆదోని పట్టణం బావాజీపేటకు చెందిన వడ్డె రామచంద్ర, కురువ మల్లమ్మ కర్ణాటక రాష్ట్రం రారావిలో మద్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తుండగా పెద్దహరివాణం సమీపంలోని రుద్రమ్మ రైస్‌మిల్ వద్ద పట్టుకొని అరెస్టు చేసినట్లు ఇస్వి హెడ్ కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్ తెలిపారు. వీరి వద్ద నుంచి 8 పీఎం బ్రాండ్ కలిగిన 92 (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

కౌతాళం: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎన్‌ఐసీలోకి మార్చి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 22వ తేదీన చేపట్టనున్న కర్నూలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, మండల కార్యదర్శి ఈరన్న పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బదనేహాల్ గ్రామంలో మంగళవారం ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌ఐసీ సర్వర్ వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రతి రోజు మస్టర్‌లో రెండుసార్లు ముఖ ఆధారిత హాజరు నమోదుచేయాల్సి ఉండడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ ఆధారిత హాజరు నమోదును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలను 15 రోజులకోసారి చెల్లించాల్సి ఉండగా నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదని, అలాగే కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

తాగునీరు వృథా

ఆదోని అర్బన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి రోడ్డులో మసీదు ఎదురుగా మంచినీటి పైపులైన్ లీకేజీ అయ్యి నీరు వృథాగా కాలువ పాలవుతోంది. ప్రతిరోజూ భారీ స్థాయిలో నీరు వృథాగా కాలువలో చేరుతోంది. అధికారులు ఆ రోడ్డుపై వెళ్లేటప్పుడు నీరు నిల్వ ఉన్నా, సమస్యపై స్థానికులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా, ఇలాంటి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.

విజేత కానాల వృషభాలు



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా, సంజామల మండలం, కానాల గుండం చెన్నారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో అనంతపురం జిల్లా, ఉబిచెర్ల పుల్లెం గోవిందు వృషభాలు, డోన్ మండలం, సీసంగుంతల మదన్‌మోహన్‌రెడ్డి వృషభాలు, బేతంచర్ల మండలం, హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా, మేడిమాగులపల్లె తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు నిలిచాయి. పోటీల్లో 8 జతల వృషభాలు పాల్గొనగా గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేశారు. ఉత్సవాల సందర్భంగా నాలుగు రోజుల పాటు ఆయల కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కోయిలకొండ జూనియర్ జట్టు విజేతగా నిలిచి రూ.20 వేలు కైవసం చేసుకోగా తర్వాతి స్థానాల్లో నిలిచిన అమకతాడు జట్టు, ప్యాపిలి మండలం బావిపల్లె జట్టు, వెల్దుర్తి మండలం సూదేపల్లె జట్టు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను దక్కించుకున్నాయి.

స్టూడెంట్ సంచిక ఆవిష్కరణ



పీడీఎస్‌ఓ ప్రచురించిన స్టూడెంట్ సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: పీడీఎస్‌ఓ ప్రచురించిన స్టూడెంట్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ మంగళవారం ఆదోని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. పీడీఎస్‌ఓ డివిజన్ ప్రెసిడెంట్ ఖాదర్ అధ్యక్షత వహించగా ఆవిష్కర్తగా ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కస్వామి, ఆర్‌సీసీ పొలిటికల్ ఆర్గనైజర్ రాజన్న, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ గోవిందప్ప, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, రైతు ఉద్యమ నాయకులు సాయిబాబా, తెలుగు పండితులు నలారెడ్డి, పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ తిరుమలేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యను కాషాయీకరిస్తూ అసలైన చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగించి, అశాస్త్రీయ పాఠ్యాంశాలతో నింపుతున్నారని ఆరోపించారు. పోరాటాల చరిత్రను విద్యార్థులు సరైన కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పీడీఎస్‌ఓ పట్టణ నాయకులు నాసిమ్, ఇస్మాయిల్, నిఖిత, రంగస్వామి, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదోని ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

ఆదోని అర్బన్: ఆదోని పట్టణానికి ఏఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏఎస్పీగా పనిచేసిన ఆయన ఆదోనికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్ పులివెందులకు బదిలీ అయ్యారు. ముందుగా ఆదోని డీఎస్పీ కార్యాలయంలో వేద పండితుడు ప్రత్యేక పూజలు నిర్వహించి ఏఎస్పీని ఆశీర్వదించారు. అనంతరం తాలూకా 2, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐలు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసనాయక్, శ్రీరామ్, ఎస్‌ఐలు చంద్ర, ప్రహ్లాద్, మహేష్‌బాబు తదితరులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. పంజాబ్ రాష్ట్రం చండీఘర్‌కు చెందిన రాణా 2018 బ్యాచ్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై అనంతపురంలోని డిస్టిక్ ట్రైనింగ్‌లో ఉంటూ గ్రేహౌండ్స్‌లో పనిచేసి రంపచోడవరం ఏఎస్పీగా వెళ్లారు. ప్రస్తుతం అక్కడి నుంచి ఆదోనికి బదిలీ అయ్యారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రజలు తనను నేరుగా గానీ, ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలన్నారు. అవాంఛనీయ కార్యకలాపాలు, మట్కా, పేకాట, జూదం ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే తనకు సమాచారం ఇవ్వాలని, వివరాలు తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్దిసేపటికి ఆయన విధుల్లో భాగంగా జిల్లా కేంద్రానికి వెళ్లారు.

నేటి నుంచి ఈరన్న స్వామి జయంత్యుత్సవాలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఈరన్న స్వామి దేవాలయంలో బుధవారం నుంచి 5వ తేదీ వరకు నరసింహ స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 3న తెల్లవారుజామున 5 గంటల నుంచి 7 గంటల వరకు సుప్రభాత సేవ, బిందెసేవ, వేదపఠనం , అష్టోత్తరం, సహస్రనామార్చన మహామంగళ హారతి పూజలు, 4న స్వామి వారి ఏకశిలాతోరణంనకు సంప్రోక్షణ, అష్టోత్తర కలశ క్షీరాభిషేకం, పంచామృతభిషేకం, బిందెసేవ, సుప్రభాతసేవ, గణపతి పూజ పుణ్యావాచనము, ప్రధాన కలశస్థాపన, మహాసుదర్శన హోమం, అదేరోజు రాత్రి ఉరుకుంద భజనమండలి వారిచే భజన ఉంటుందన్నారు. 5న తెల్లవారు జామున 5గంటలకు సుప్రభాత సేవ, వేదపారాయణం, మహాభిషేకం, మహామంగళ హారతి పూజలు ఉంటాయని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రూ.1.28 కోట్లతో బండపరుపు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో రూ.1.28 కోట్లతో బండపరుపు పనులు చేపడుతున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. మహాప్రాకారం పాత కాంపౌండ్‌వాల్ మధ్య భక్తుల సౌకర్యార్థం బండపరుపు వేసేందుకు టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. దేవాలయం నాలుగు వైపులా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మహాప్రాకారం గోపురాలు ఇప్పటికే మూడు వైపులా పూర్తయ్యాయని, ముందు భాగంలో మాత్రం పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. స్థపతి ఆదేశానుసారం పనులు పూర్తి చేస్తామన్నారు.



ఇంద్రధనస్సు సోయగం

మండల కేంద్రంలోని రంగప్ప గట్టు సమీపంలో ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో కోసిగిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం ఆగిన తర్వాత కొద్దిసేపు కొండపై నుంచి ఆకాశంలో ఏడు రంగులతో ఇంద్రధనస్సు కనిపించింది. చిన్నారులు ఇంద్ర ధనస్సును చూసి కేరింతలు కొట్టారు. – కోసిగి